# పెద్దవాడి ప్రాపకం

బళ్ళో రోజల్లా అరచి నాన్న నెల తిరిగేసరికి నూటపది తెస్తాడు. ఎట్లా సరిపోతుంది ? నానమ్మా, అమ్మా, నాన్నా, నలుగురు పిల్లలూను. ఇంటికింద గుడ్డ పీలిక అనేది కొని సంవత్సరం ఐంది. ఆ బాకీ బలిసి దాగుంది గాని ఇంటో అన్నీ చింకిపాతలే. అమ్మ చీరలన్నిటికీ పుత్తకుట్లే. రవికెలన్నిటికీ మాసికలే. పిల్లల గుడ్డ లన్నీ చిరుగులుపట్టినై. ఒక్క దిండుకు గలీబు లేదు, ఒక్క దుప్పటి సరిగాలేదు. నాన్న బడికి వెళ్ళటానికైనా ఒక దోవతిగాని, చొక్కాగానిలేదు. వంటింట్లో అన్నీ చిల్లిబొచ్చెలే. గుడ్డపీలికలు పెట్టీ, చింతపండు పెట్టి అమ్మ నానా అగచాట్లూ పడుతున్నది. బొక్కెనకి చిల్లి. పైకి లాగేలోపల సగం నీళ్ళుండవు. కొత్త బొక్కెన కొనటానికి డబ్బులేదు.

నాన్న అమ్మను కోప్పడతాడు : "సుప్ప అయినవాళ్ళనూ, కానివాళ్ళనూ భోజనానికుండమనకపోతే ఇంత ఇబ్బంది ఉండదు. రాఘవరావు డెబ్బయ్యయిదు రూపాయల జీతంతో హాయిగా కాలక్షేపం చేస్తున్నాడు" అంటాడు.

"రాఘవరావుకేం? ముగ్గురే పిల్లలు ! మనకు నలుగురాయె....ఇంటికొచ్చిన వాళ్ళని భోజనానికి ఉండమనకుండా పోనివ్వటం నా చాతకాదు బాబూ. మానాన్న పంక్తిని పదిమంది ఉంటేగాని భోంచేసేవాడు కాడు" అంటుంది అమ్మ.

మీ నాన్న సంగతి నా దగ్గిర చెప్పకు. మీ మేనత్త ఆస్తి లోకులకు పెట్టి, ఇంటిల్లిపాదీతిని, తన ఆస్తి దమ్మిడీలతో సహా పాతరేశాడు. కుర్రాణ్ణి పెంచుకుంటా నంటే ఇదుగో అదిగో అని ఆవిడ చచ్చేదాకా తాత్సారంచేసి ఆఖరుకు అంతా తనే దిగమింగేశాడు."

"చాతకాకపోతే మా వాళ్ళమీద విరుచుకుపడాలిసిందే."

"నే పడేదేమిటి ? నీ అన్నల నడుగు. వాళ్ళాయన అల్లుళ్ళుకారుగా, ఒక్క గాను ఒక్క కూతురువు. నీ కెన్నడన్నా తన చేతిమీదుగా ఒక పాతికరూపాయలు ఖరీదుచేసే చీరకొన్న పాపాన పోయినాడా, మీనాన్న ?"

"ఏమో, మీకెవరు చెబుతారు ?. అన్నట్టు శాస్తుర్లు కొడుకు పెళ్ళి ఇంకా నాలుగు రోజులే వుంది. పదిహేను రూపాయలుంటే వెళ్ళిరావచ్చు. ఓ పది రూపాయలు చదివిస్తే చాలు. మన కున్నదేమిటో వాళ్ళకు తెలీదా ఏమిటి?"

"తన కొడుకు పెళ్ళినిమిత్తం మనం పాతికరూపాయలు ఖర్చు పెట్టగల

మనుకుంటే మీ శాస్త్రుర్లుకు మన సంగతి ఏమీ తెలీదన్నమాట. కావలిస్తే నే చెప్పానని మీ శాస్త్రుర్లుతో చెప్పు. అర్థమైంది గదూ ?"

"మీరు మరీ యిట్లా అయిపోతున్నా రేమిటండీ ? డబ్బులేదని పెళ్ళికి బోకుండా వుంటారా ? నే నెక్కడా విన్లేదు."

"మరి ఏంలేదని మానుకుంటారో చెప్పు, చూతాం."

"నేను నలుగురిలోనూ తలెత్తుకు తిరగక్కర్లా?"

"నేను ఇంట్లోనే తలెత్తుకు తిరగలేకుండా ఉంటే, నువు నలుగురూ అంటా వేమిటీ? ప్రస్తుతం నా తలే ఎత్తు. మాట్లాడక ఊరుకో."

"మీరేమీ ఇవ్వక్కర్లేదులెండి. చేతిగాజులు తాకట్టు పెట్టేస్తాను.''

"నీ పిల్లలు చింకిపాక్కాలేసుకుని ఏబ్రాసిలల్లే తిరుగుతుంటే నీకు అవమానం లేదు. వేలువిడిచిన పెంతల్లి కొడుకు తన కొడుక్కు పెళ్ళిచేసుకుంటే వెళ్ళకపోతే నీకవమానం.''

"వాడు నాకు సొంత అన్నలకంటె ఎక్కువైనవాడు. ప్రేమానుబంధాలు మీకులేకపోవచ్చుగాని, మేం మీ మాదిరిగా పెరగలేదు.''

''అడగక్కర్లేదు. మీ పెద్దన్నా పెద్దవాడి వొడుక్కు నిన్ను పిలిచాడా ?''

"ఏదో డబ్బు యిబ్బందిలో ఉండి వాడు ఎవర్నీ పిలవకుండా ఆ పోగుకాస్తా పిల్లాడి మెళ్ళో వేసుకుంటే దానికి దెప్పేనా ?"

"ఇప్పుడు నీకేగాదు డబ్బుయిబ్బంది లేంది !''

"పెళ్ళి ఒడుగూ ఒకటేనా ఏమిటి ?''

అమ్మతో వాదించటం చాలాకష్టం. నాన్నవేసే ప్రశ్నలో తనకు చిక్కిన మాట అందుకుని విషయం తిప్పేస్తుంది.

## 2

''అమ్మా, తాతయ్య వస్తున్నాట్టేవ్ !"

తాతయ్య నాన్నకు కార్డు రాశాడు. తాతయ్య దగ్గిర రెండువేల రూపాయలకు తక్కువ వుండవు. అంతా తన ట్రంకు పెట్టెలోనే వుంచుకుంటాడు. తాతయ్య వస్తే ఎన్నో చిక్కులు తీరుతై.

''.. నాకొడుకులు నాకు కానివాళ్ళయిపోయినారు. పెద్దవాడో మామగారివాడైపోయినాడు. రెండోవాడు పెళ్ళాం ఎట్లా ఆడిస్తే అట్లా ఆడతాడు. ఏనాడు మీ అత్తగారు కాలధర్మం చేసిందో ఆనాడే నేను దిక్కులేని పక్షి నయిపోయినాను. ఇక నాకు నువూ, అమ్మాయీ తప్ప ఎవరున్నారు ? ముసలి వృద్ధును. నా ఆయుర్దాయం యిక వారాలలోనూ, నెలలలోనూ ఉందిగాని సంవత్సరాలలో లేదు. నా ఆయుశ్శేషం మీ మధ్యనే గడపదలిచాను. నీ పిల్లలే నా అసలు మనుమలూ, మనుమరాళ్ళూనూ . ''
అంటూ రాశాడు తాతయ్య.

తాతయ్య వస్తున్నాడంటే నాన్నకూడా లోపల కొంచెం సంతోషంగానే ఉంది. మామూలుగా ఆయన పేరుచెబితే మండిపడేవాడు, ''ఈయనకిట్లా గాలి మళ్ళిందేం ?'' అని ఊరుకున్నాడు.

తాతయ్య రాసిన ఉత్తరం మడిచి కళ్ళు తుడుచుకుంటూ అమ్మ ''కాక పోయినా మా చిన్నన్నయ్య దగ్గిర ఎవరూ ఉండలేరు. పాపం వాడు మంచివాడే. వాడి పెళ్ళాం.. .!'' అని వాపెలేసింది.

"నువ్వట్లా అంటేనే నాకు మంట. మా జానకివంటి మహాఇల్లాలు ఏదో పాపం చేసుకుని మీ చిన్నన్న పాలపడింది. దాన్ని అన్నవాళ్ళు పురుగులుబడి పోతారు. మీ అన్న దానిచేత నీచమైన పనులన్నీ చేయిస్తాడు. తను లోకానికి మంచివాడుగా కనిపించాలి. తన పెళ్ళాం చెడ్డదని అంతా అనుకోవాలి. వెధవ వేషాలు!" అన్నాడు నాన్న.

మర్నాడు తాతయ్య వచ్చాడు. ట్రంకు పెట్టెతోసహా బండిదిగాడు. బండి వాడి చేతిలో రెండణాలు పెట్టాడు.

"ఇదేంటయ్యోయ్? పావలాకు తక్కువరానని ఆడనే చెబితినిగా?" అన్నాడు బండివాడు.

"నువు చెప్పింది వేదవాక్యమా. నేను బేహాకన్న నాలికపీక్కుచచ్చినా ఇవ్వననలా. ఆ మాట చెప్పవేం?" అన్నాడు తాతయ్య.

"చాల్చాల్లే, ఇంకో బేడా ఇయ్యి."

"మాటలు తిన్నగారానీ, ఎవరనుకున్నావ్, వుండాఖోర్!'' అని తాతయ్య చేతికర్ర ఎత్తి బండివాణ్ణి ఒకటి పెట్టాడు. వాడు దెబ్బ తప్పించుకుని తాతయ్య కర్ర లాక్కుని తిరిగి ఒకటి పెట్టబోయినాడు. నాన్న అడ్డంపడి బండివాడికి మరో రెండణాలు యిచ్చి బుజ్జగించి పంపేశాడు.

తాతయ్య కాళ్ళుకడుక్కుని కూర్చుంటూనే పిల్లలు నలుగురికీ తలా ఒక కానీ యిచ్చి ఏదన్నా కొనుక్కోమన్నాడు. అమ్మ మొహం చాటంత అయింది.

అమ్మా, తాతయ్యా కూర్చుని చిన్నన్న పెళ్ళాం జానకిని గంటసేపు తిట్టు కున్నారు.

నాన్న బడికి వెళ్ళేటప్పుడు తాతయ్య ''ఏమోయ్, నువు సాయంకాలం వచ్చేటప్పుడు ఒక అరడజను బత్తాయిపళ్ళు పట్టుకురా, నేను రాత్రివేళ భోంచెయ్యను" అన్నాడు.

## 3

శాస్త్రుల్లు కొడుకు పెళ్ళికి అమ్మా పిల్లలూ వెళ్ళారు. తాతయ్యదగ్గిర అమ్మ ముప్పైరూపాయలు బదులు తీసుకున్నది. నాన్న రానన్నాడు. శలవ దొరకదుట.

"అదేమిటోయ్ మీ హెడ్మాస్టరుతో నేను చెబుతా పద!'' అన్నాడు తాతయ్య.

"మీరూరుకోండి. అసలే నేనంటే మా హెడ్మాస్టరుకు మంట'' అన్నాడు నాన్న.

నాన్న పెళ్ళికైతే వెళ్ళలేదు గాని, తాతయ్య హెడ్మాస్టరు దగ్గిరికివెళ్ళి తన గొప్పతనమంతా చెప్పుకుని ఆయనను నానా మాటలూ అని వచ్చేశాడు. స్కూలులో హెడ్మాస్టరు నాన్నను కాల్చుకు తినసాగాడు.

తాతయ్య ఇంటి చాకలితో కూడా పోట్లాడాడు.

''ఇదుగోనోయ్. ఈ చాకలివెధవను తక్షణం తీసెయ్యి. వీడింత పొగరుగా మాట్లాడతాడా? నేను ఎన్నివేలమంది చాకళ్ళను చూసి ఉంటాను. ఏమిటి వీడి ఉద్దేశం?" అని తాతయ్య అరిచాడు.

''అట్లాగే తీసేద్దాం లెండి. వాడికి ఏడో, ఎనిమిదో ఇవ్వాలి. ఇచ్చిన తరవాత వీణ్ణి పంపించి మరొకర్ని పెట్టుకుందాం. అయినా అందరూ ఇట్లాగే వుంటారు, ఇప్పుడు వాళ్ళవీ రోజులు'' అన్నాడు నాన్న - తాతయ్యకు ఇష్టమయ్యేట్టుగానూ, తన కిబ్బంది లేకుండానూ.

తాతయ్య పెద్ద చప్పుడుతో పెట్టె తెరిచి పదిరూపాయల కాగితంతీసి నాన్న కిచ్చి, ''వాడిది వాడిమొహాన పారేసి ఇక ఎన్నటికీ ఈ గడపలో అడుగు పెట్ట వద్దని వాడితో చెప్పెయ్యి'' అన్నాడు, వాడితో స్వయంగా చెప్పటంకూడా తనకు అసహ్యమైనట్టు.

నాన్నకు ఏం చెయ్యాలో తోచలేదు.

''తొందరేంలెండి. ఇద్దాం మెల్లిగా, ఎల్లుండి నాకు జీతం వచ్చేస్తుందిగా!" అన్నాడు.

''అదే నాకు పనికిరాదు. కటాదిటీగా వుండాలి. అవేవీను నా చేతకాదు ఊం!"

చాకలికి వుద్వాసన అయింది.

కూరలవాళ్లు గడపతొక్కటం మానేశారు. తాతయ్య అందరితోనూ పోట్లాడాడు. ఆ పోటాటకు అర్థంలేదు.

''వొంకాయలు వీశె అరణాలా? నా చిన్నతనంలో అర్ధణాకూ బుట్టెడిచ్చేవాళ్లు ... మూణ్ణాల కిస్తే ఇయ్యి. లేకపోతే పో!— ఏం రాళ్లవి? నిన్నిప్పుడు పోలీసులకు పట్టిస్తా!.... ఇంకో బేడా ఇవ్వాలా? మూణ్ణాలపైన దమ్మిడి ఇవ్వనని చెప్పలా! .. నువ్వసలు మాకు వంకాయలే ఇవ్వలా. పోయి నీ బాబుతో చెప్పుకో! భడవా, పుండాఖోర్! చెప్పు తీసుకు తన్నేను!" ఇది వరస.

పెరుగుపోసే ముండను పట్టుకుని "నీ మొహం చూస్తే లంజవల్లే ఉన్నావు గాని సంసారల్లే లేవే!'' అన్నాడు తాతయ్య. నాన్న జీతంలో మిగిలిన డబ్బులు

అప్పటికప్పుడిచ్చేసి దాన్ని వదిలించుకోవలసి వచ్చింది. శేరు రూపాయికూ కాడా అది పెరుగు పొయ్యనన్నది.

నాన్నకు ఎటుతిరిగినా ఊపిరి సలపలేదు. తాతయ్య వచ్చినాక ఇల్లంతా తారుమారయింది. నాన్నా అమ్మా రోజూ కొట్లాడుకోవటమే. పిల్లలుకూడా ఒకళ్లతో ఒకళ్లు పోట్లాడుకుని చచ్చేట్టు కొట్టుకునేవాళ్లు. నాయనమ్మకూ తాతయ్యకూ ఒక్క క్షణం పడేదికాదు. తాతయ్య విషయం ఎవరన్నా నవ్వుతూ మాట్లాడటం మొదలు పెడితే నాన్నకు ప్రాణం చచ్చి ఊరుకునేది.

# 4

మొదట్లో అమ్మ పూర్తిగా తాతయ్యను వెనకేసుకుని వచ్చి నాన్నతో పోట్లాడేది. రాను రాను ఆవిడ నాన్నను ఓదార్చసాదింది:

''పోనివ్వండి, ముసలాడు. ఇంతకాలమూ ఆయన కట్లా జరిగింది. ఇప్పుడు మనం మారిస్తే మారతాడా? బతికినన్నాళ్లు బతకడు. ఆయనకున్నదీ మనకే ఇస్తాడు. మనకన్న ఆయన కెవరున్నారు?''

ఈ మాటలు నాన్నకు తృప్తి కలిగించలేదు.

“ఆయనకేం, ఆయన రాయల్లే ఇంకా పాతికేళ్ళు బతుకుతాడు. మనందరి చావూ కళ్ల జూసిగానీ ఆయన హరీ అనడు. ఈలోపల ఏంచెయ్యాలో నాకు తోచటం లేదు. నాకోసం ఎవరన్నా రావటం భయం. నాకన్న ముందు వాళ్ళని తనే సంభాషణలో పెడతాడు. వాళ్లంతా పసిపిల్లలనుకుంటాడో ఏమిటో! వాళ్ళు తననుచూసి నవ్వుతారనన్నా తెలుసుకోలేడు. వాళ్లతో చివరకు పోట్లాడి ఇష్టంవచ్చినట్టు తిడతాడు, లేదా నన్ను గురించి పరమఛండాలంగా వాళ్ళ ఎదట మాట్లాడతాడు. ఇంతకాలమూ తిన్నామో పస్తేవున్నామో, పైకి మర్యాదగా బతికాం. ఇక అది సాధ్యంకాదు. అందరిలోనూ నేను నవ్వులపాలై పోయినాను.”

“రోజూ నన్ను పనివున్నట్టు పిలిచి, నీకిచ్చిన ముప్పైరూపాయలూ, చాకలికిచ్చిన ఏడు రూపాయల తొమ్మిదణాలూ, పెరుగుదాని కిచ్చిన అయిదురూపాయల మూడణాలూ, నాకు బదులిచ్చిన యాభై రూపాయలూ ఏకరువుపెట్టి, ‘జ్ఞాపకం ఉండటానికి చెబుతున్నాను. మరేంలేదు’ అంటాడు. ఆయనవచ్చి మూడు నెల్లయింది. ఆయనకు పళ్లకనీ వొడ్డి మంగలాడికనీ నేను పదిహేను రూపాయలపైచిల్లర ఇచ్చుకున్నాను; ఆ సంగతి ఎత్తడు. ఇంటి ఖర్చుకింద దమ్మిడీ ఇవ్వడు. ఎప్పుడైనా పిల్లల చేతిలో కానీ అర్ధణా పెడతాడు, అందులో కూడా పక్షపాతమూ పగలూను. తనకెవరు కోపం తెప్పిస్తే వాడికి కాని ఇవ్వక పగతీర్చుకుంటాడు. పిల్లలు వాళ్లలోవాళ్లు కీచులాడుకు ఛస్తున్నారు. ఆ పిల్లలకీ ఆయనకీ తేడా ఏమీలేదు. ఆయనదగ్గర డబ్బుంది. వాళ్ల దగ్గరలేదు. అంతే. ఇదంతా ఎట్లా తేలుతుందో

నాకేమీ పాలుపోవటంలేదు. ముసలాణ్ణి పొమ్మనటానికి నోరురాదు. కాని ఆయనంతట ఆయనపోతే నేను దేవుడికి డజను కొబ్బరికాయలు కొడతాను - సత్యప్రమాణకంగా చెబుతున్నాను'' అన్నాడు నాన్న.

నాన్న అన్న మాటలలో ఆవగింజంత అబద్ధంలేదు. రెండోవాడికి నెత్తురు బంక విరేచనాలు పట్టుకున్నై. నాన్న చేతిలో దమ్మిడీ ఆడటంలేదు. అప్పు యిక పుట్టదు. అమ్మ తాతయ్యను రెండు రూపాయ లడిగింది.

"తే, తే తే! డబ్బు చెట్టున కాస్తుందా? ఒళ్లు తెలీకుండా ఆగడ్డీ ఈగడ్డీ తింటే రోగం రాదూ ? ఎందుకు మందులకు పొయ్యటం ? మా చిన్నతనంలో వైద్యులూ, మందులూ లేవు గనకనే రాళ్లల్లే బతికాం. ఏమీ అక్కర్లేదు. అదే పోతుందిలే!'' అన్నాడు తాతయ్య. తాతయ్యకు రెండో వాడిమీద కోపం.

"మీ చిన్నతనంలో రైళ్లు లేవు అందుకని ఇప్పుడు మీరు రైలెక్కటం మానారా? ఆ రోజులలో లేనివి ఈ రోజులలో ఎన్నో ఉన్నై'' అన్నాడు నాన్న.

"అంగట్లో అన్నీ వున్నై. అల్లుడినోట్లో శని ! వుంటే తెచ్చుకో. నేను వద్దన్నానా ఏమిటి ? ఇప్పటికి వందరూపాయల దాకా అప్పిచ్చాను. అయిదు నెల్లయింది. ఒక్క రూపాయి చెల్లిచ్చావా? ఒక్క అర్ధరూపాయ చెల్లిచ్చావా ? ఫలానప్పుడు ఇస్తానన్నా చెప్పావా? ఎందుకీ కబుర్లు? ఛష్!'' అన్నాడు తాతయ్య.

''ఐదునెల్ల నుంచి నువు నా ఇంటో వుండి తినటంలేదా?'' అని నాన్న అడగలేదు. అడగలేదని తాతయ్యకు తెలుసును.

## 5

నాన్నకి ప్రాణం విసిగిపోయింది. ఎవరికైనా విసుగుతుంది. తాతయ్యకు ఎదురుచెప్పటం మొదలుపెట్టాడు. ఒకప్పుడు పాకులాడిన మంచితనానికి పూర్తిగా స్వస్తి చెప్పేశాడు.

అయితే తాతయ్యకు భయంలేదు. ఎందుకంటే నాన్న దగ్గిర డబ్బులేదు. డబ్బులేనివాడి మాటలకు అర్థంలేదు. డబ్బులేనివాడు చెప్పేన్యాయం న్యాయం కాదు. చేసే తర్కం తర్కంకాదు. డబ్బులేనివాడు హీనుడు, భ్రష్టుడు, అస్పృశ్యుడు అని తాతయ్య మతం. అందుచేత నాన్న ఎన్ని ప్రశ్నలడిగినా తాతయ్య దులిపేసుకుని ఆఖరుకు ఒక్కటే ప్రశ్న అడిగేవాడు.

"నా దగ్గిర పదినెల్ల కిందట నువ్వు స్వయంగా నీ చేతులతో తీసుకున్న యాభై రూపాయలలో ఒక్క ఠోలీ తిరిగి ఇచ్చావా ? నేను మిగిలినవాటి విషయం అడగను. నా కిష్టమై ఇచ్చుకున్నాను. నా కూతురికి పెట్టుకున్నాను. ఇది బాకీయే. పెద్దమనిషిని, బాకీ ఏమని ఎగేశావు ? అది చెప్పు నాకు ముందు; నువేమన్న పెద్దమనిషివి ? ఏమని మాట్లాడవస్తున్నావు?"

"నాతో పోట్లాడుతూ నా యింటో వుండటం దేనికి ? అది మీకేం సుఖం?" అన్నాడు నాన్న.

"నీ యిల్లా? నిన్ను చూసి నేను రాలేదు. ఈ పెద్దమనుషులందర్నీ అడుగు. (అక్కడ చేరిన పెద్దమనుషులు పోస్టుజవానూ, వీధిన గుడ్డలమ్ము కునే వర్తకుడూ, చాట అరువడగటానికి వచ్చిన పక్కింటివారి పనిమనిషిని!) నేను నా కూతురింటికి వచ్చాను. ఈ క్షణం పోతాను. నా డబ్బు నాకు పారెయ్యి."

తాతయ్యతో మాట్లాడటం కంఠశోష అనిపించింది నాన్నకి. నాన్న కష్టాలు ఒకరు ఆర్పేవీ తీర్చేవీ కావు. అవి భగవంతుడే తీర్చాలి.

తాతయ్య అకస్మాత్తుగా జాయిలా పడ్డాడు. మర్నాడు రాత్రి కింద పెట్టారు. తెల్లవారుఝామున పోయినాడు.

నాన్న బావమరుదు లిద్దరికీ తంతులిచ్చాడు. వాళ్లు నాలుగోరోజున కాని రాలేదు. ఈ లోపల దహనసంస్కారానికి నాన్నే తల తాకట్టుపెట్టి యాభై రూపాయలు తెచ్చి ఖర్చు చేశాడు.

మామయ్య లిద్దరూ వచ్చారు. తండ్రిగారి పెట్టె తెరిచి డబ్బు లెక్కచూసుకున్నారు. పెట్టెలో పదిహేను వందల పైన కొద్ది చిల్లర వుంది.

"ఇంకా అయిదువందలుండాలి" అన్నాడు పెద్ద మామయ్య. "నాకు కిందటేడు నాన్న రాసిన ఉత్తరం ఇదుగో!"

"మా యిల్లు వదలి వచ్చేటప్పుడు — పదకొండు మాసాల కిందట — నాన్న నాతో అమాటే అన్నాడు" అన్నాడు చిన్నమామయ్య.

ఇద్దరు మామయ్యలూ నాన్న కేసి చూశారు.

"మా యింటికి వచ్చినాక మా చేతికి సరిగా వందరూపాయ లిచ్చాడు. అది కూడా ఏడెనిమిది నెలల క్రితం" అన్నాడు నాన్న.

"మిగిలిన నాలుగువందలూ ఏమయినట్టు?" అన్నాడు పెద్దమామయ్య.

"ఏమో, ఏంఖర్చు చేసుకున్నాడో ?" అన్నాడు నాన్న.

"తాగుడా, ముండలా ? ఏం ఖర్చు ఆయనకు ?" అన్నాడు చిన్నమామయ్య.

"అది ఎవరు చెప్పగలరు? ఆయన దహనక్రియలకు కూడా నేనే డబ్బు అప్పు తెచ్చాను."

"ఆయనకు మందిప్పించటానికి డబ్బు అప్పు తెస్తే ఆయన ఇంకా బతికే వుండును" అన్నాడు పెద్దమామయ్య.

"పదిహేనువందలు పెట్టెలో పెట్టుకుని వైద్యుడు కావాలంటే నాతో చెప్ప కూడదూ ? ఆయన బొట్టికాయా?" అన్నాడు నాన్న.

"అదంతా ఇప్పుడెందుకన్నయ్యా ? ఈ నాలుగు వందలూ ఏమయినట్టు ?" అన్నాడు చిన్నమామయ్య.

"నేను చెబుతా పట్టు. నేనూ మీ చెల్లెలూ కలిసి దొంగిలించినట్లు !" అన్నాడు నాన్న వెటకారంగా.

"తెలుస్తూనే వుంది!" అన్నాడు పెద్దమామయ్య.

—ముద్రణ : జ్యోతి, జూన్ 1948